## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం (జూన్ 16) విడుదలయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులతోపాటు మార్కులను పెంచుకోవడానికి ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసిన వారికి కూడా ఫలితాలను వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్ లలో విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.సబ్జెక్ట్ వైజ్ విద్యార్థుల మార్కుల వివరాలు బోర్డు అధికారులు అందుబాటులో ఉంచారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

www.suryaa.news

# ప్రభాత సూర్య

తెలుగు జాతీయ దిన పత్రిక

వేల రూ.5/ - పేజీలు : 8 మంగళవారం 17 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 41

విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## యుద్ధాల యుగం కాదు

- వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- భారత ప్రధాని మోదీ, సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్ పిలుపు
- ప్రపంచ మానవాళి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని శాంతి, స్థిరత్వం కోసం అన్ని దేశాలూ కలిసికట్టుగా పని చేయాలి



## కడసారి చూపులకు నిరీక్షణ

- 24 గంటలూ పనిచేస్తున్న డీఎన్‌యే ప్రయోగశాల
- కొలిక్కిరాని ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల గుర్తింపు
- గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపాణీ సహా 76 మృతదేహాలను కుటుంబికులకు అప్పగించారు.

## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం

- వెల్లడించిన ఆస్పత్రి వర్గాలు
- అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే

# రాష్ట్రవ్యాప్తంగా 'రైతు నేస్తం'

- తొమ్మిది రోజుల్లో 9వేల కోట్లు ఇస్తాం
- రైతు నేస్తం ప్రారంభోత్సవంలో రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- తొలిరోజు 41.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,349 కోట్లు జమ
- ఎకరానికి రూ.6 వేల చొప్పున విడుదలకు కంప్యూటర్ బటన్ నొక్కిన ముఖ్యమంత్రి



సూర్య హైదరాబాద్

రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 70.11 లక్షల మంది రైతులకు చెందిన 1.49 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేస్తూ కంప్యూటర్ బటన్ నొక్కారు. కేవలం 9 రోజుల్లో రైతులందరికీ మొత్తం రూ.9 వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. తొలిరోజు సోమవారం 2 ఎకరాల లోపు 41,25,289 మంది రైతులకు రూ.2,349.83 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. 39.16 లక్షల ఎకరాలకు గాను ఈ డబ్బులు జమయ్యాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం - మిగతా 2లో

## వైద్య కళాశాలల్లో ఏ వసతులు కల్పించాలి?

- అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి
- క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- వైద్యారోగ్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయండి
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై విస్తృత ప్రచారం
- నిర్వహించండి... మంత్రులకు సీఎం రేవంత్ సూచన
- జరగని నిర్ణయాలు ముందే చెబితే ప్రజల్లో పలుచన అవుతామంటూ మందలింపు



సూర్య హైదరాబాద్

జూలైలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని వారు గమనిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో, - మిగతా 2లో



## అవసరమైతే మళ్లీ విచారణకు రావాలి

- సెల్‌ఫోన్లు ఇవ్వండి.. కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం
- 2021-2024 మధ్య వినియోగించిన ఫోన్లు 18లోగా అప్పగించాలని సూచన
- అంతకుముందు సీజ్ చేసేందుకు యత్నం..ఫోన్ తేలేదన్న కేటీఆర్!
- ఫార్ములా- ఈ రేసు కేసులో 8 గంటలకుపైగా విచారణ

## పాతబస్తీ మెట్రో పనులకు ఊతం

- రూ.125 కోట్లు విడుదల
- పనులు, పరిహారానికి దోహదం

సూర్య న్యూస్ హైదరాబాద్

పాత బస్తీలో చేపట్టిన మెట్రో కారిడార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఊతమిచ్చింది. 2025-26 బడ్జెట్‌లో కేటాయించిన రూ.500 కోట్లలో రూ.125 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలకశాఖ సోమవారం ఉత్తర్వులు మంజూరు చేసింది. రెండో దశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌ను చేపడుతున్న విషయం- మిగతా 2లో



## దేవుడికీ అర్థం కారు!

- మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టు మండిపాటు
- భవన నిర్మాణమంతా పూర్తయ్యే వరకు ఏం చేస్తారు?
- తర్వాత అక్రమ నిర్మాణం,కూల్చివేత అంటూ హడావుడి చేస్తారు
- పన్ను వసూలుకు మాత్రం భవన వివరాలన్నీ తెలుస్తయ్!
- రాష్ట్రంలో అనధికారిక నిర్మాణాలకు అధికారులదే బాధ్యత
- తీరు మారకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని హెచ్చరిక



సూర్య న్యూస్ హైదరాబాద్

దేవుడు దిగివచ్చినా మున్సిపల్ అధికారుల తీరును అర్థం చేసుకోవడం సాధ్యం కాదని హైకోర్టు మండిపడింది. కళ్ల ముందే అంతస్తులకు అంతస్తులు భవన నిర్మాణం జరుగుతున్నా కబోదుల్లా వ్యవహరిస్తున్నారని.. తీరా నిర్మాణం పూర్తయ్యాక విధులు గుర్తుకొచ్చి కూల్చివేత అంటూ హడావుడి చేస్తున్నారని ఘాటు - మిగతా 2లో




## విద్యార్థులు తగ్గుతున్నారు

- గతంలో మూతపడిన స్కూళ్లు ఈసారైనా తెరుచుకునేనా?
- గతేడాది విద్యార్థుల్లేక, పది మందికంటే తక్కువ ఉండి మూతపడినవి 1,980
- విద్యార్థులను చేర్పించి అందులో కొన్నింటిని ప్రారంభిస్తున్న యంత్రాంగం
- మిగతా పాఠశాలలు ఈసారైనా తెరుచుకునేనా?

# జనగణనకు నోటిఫికేషన్

- విడుదల చేసిన కేంద్ర హోం శాఖ.. మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో
- 2026 అక్టోబరు 1 నాటికి పూర్తి.. మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1కి
- 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో నిర్వహణ
- అంచనా వ్యయం రూ.13 వేల కోట్లు.. డేటా లీక్ కాకుండా గట్టి చర్యలు
- కులగణన కూడా ఇందులో భాగమే: కేంద్ర హోం శాఖ

3



# యుద్ధాల యుగం కాదు

నికోసియా

పశ్చియాసియా, యూరప్‌లో జరుగుతున్న యుద్ధాలు, సంఘర్షణలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇది యుద్ధాల యుగం కాదని తేల్చిచెప్పారు. వివాదాలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, యుద్ధాలకు ముగింపు పలకాలని కోరారు. సోమవారం సైప్రస్ రాజధాని నికోసియాలో మోదీ, నికోస్ సమావేశమయ్యారు. భారత్–సైప్రస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. రక్షణ, వ్యాపారం, వాణిజ్యం, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరులు, వాతావరణ మార్పులు తదితర కీలక అంశాలపై సంప్రదింపులు జరిగాయి. ఇరుదేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయానికొచ్చారు. భేటీ అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. పశ్చిమాసియా, యూరప్‌లో కొనసాగుతున్న యుద్ధాల ప్రభావం ప్రపంచమంతటా ఉంటుందని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. ప్రపంచ మానవాళి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని శాంతి, స్థిరత్వం కోసం అన్ని దేశాలూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సంఘర్షణలకు తెరదించడానికి చర్చలు, సంప్రదింపులే మార్గమని పునరుద్ఘాటించారు. సీమాంతర ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించిన సైప్రస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్%–%సైప్రస్



ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయాన్ని లిఖించడానికి ఈ పర్యటన తనకు ఒక సువర్ణ అవకాశమని మోదీ వ్యాఖ్యానించారు. రెండు దేశాల సంబంధాలకు ప్రజాస్వామ్యం పట్ల పరస్పర విశ్వాసం, చట్టబద్ధమైన పాలనే పునాది అని స్పష్టంచేశారు. భారత్‌లో పర్యటించాలని సైప్రస్ అధ్యక్షుడిని మోదీ ఆహ్వానించారు.

**దురాక్రమణకు చరమగీతం పాడాలి: నికోస్**

భారత్–సైప్రస్ మధ్య చరిత్రాత్మక స్నేహ సంబంధాలు ఉన్నాయని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ గుర్తుచేశారు. విశ్వాసమే ప్రాతిపదికగా రెండు దేశాల నడుమ ఆత్మీయ సంబంధాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించినట్లు గుర్తుచేశారు. అంతకుముందు ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌కు చేరుకున్న మోదీ ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కౌన్సిల్ ఆఫ్ నికోసియా సభ్యుడు మైఖేలా ఖైత్రియోటి మలాపా.. మోదీ పాదాలకు నమస్కరించారు.

**వ్యాపారాభివృద్ధికి అద్భుత అవకాశాలు**

భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని నరేంద్ర మోదీ వెల్లడించారు. వ్యాపారాభివృద్ధికి తమ దేశంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలని, పెట్టుబడులతో ముందుకు రావాలని సైప్రస్ ఇన్వెస్టర్లకు, పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సైప్రస్ దక్షిణ కోస్తాతీరంలోని లిమాసోల్ సిటీలో బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మోదీ మాట్లాడారు. గత 11 ఏళ్లలో ఇండియా సాధించిన ఆర్థిక ప్రగతిని వివరించారు.

**మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం**

ప్రధాని మోదీని సైప్రస్ ప్రభుత్వం తమ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ మకారియోస్–3'ని మోదీకి ప్రదానం చేశారు. భారత్–సైప్రస్ మధ్య స్నేహబంధానికి ఈ అవార్డును అంకితం ఇస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమని అభివర్ణించారు. వసుధైక కుటుంబం అనే భావనకు ఈ పురస్కారం ఒక ప్రతీక అన్నారు. రాబోయే రోజుల్లో మన రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం అత్యున్నత స్థాయికి చేరుకుంటుందన్న విశ్వాసం తనకు ఉందని చెప్పారు.

# జనగణనకు నోటిఫికేషన్

న్యూఢిల్లీ

దేశంలో జనాభా లెక్కింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 16వ జనగణను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు అందులో స్పష్టం చేసింది. మొదటి దశ 'హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్వో)'లో భాగంగా.. ప్రజల ఇంటి పరిస్థితులు, వారి ఆస్తులు, ఇళ్లల్లో ఉండే సౌకర్యాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియను 2026 ఏప్రిల్‌లోనే ప్రారంభించనున్నట్టు సమాచారం. ఇక, రెండో దశ (పాపులేషన్ ఎన్యూమరేషన్)లో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను సేకరిస్తారు. మంచు ఎక్కువగా ఉండే జమ్ము, కశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026 అక్టోబరు 1 నాటికి, దేశంలోని మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1 నాటికి జనగణనను పూర్తిచేయనున్నట్టు కేంద్రం తన నోటిఫికేషన్‌లో వివరించింది. అలాగే.. ప్రజలు తమ వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో, యాప్‌లో స్వయంగా నమోదు చేసుకునే (సెల్ఫ్ ఎన్యూమరేషన్) వీలునూ కల్పిస్తున్నట్టు తెలిపింది. 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో.. ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించే ఈ భారీ కార్యక్రమానికి రూ.13 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. సమాచార సేకరణకు సంబంధించి ఈ ఏడాది అక్టోబరు నుంచే ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే సిబ్బందికి, సూపర్‌వైజర్లకు 45 వేల మందికి పైగా ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి 1800 మంది మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి శిక్షణ ఇవ్వడానికి జాతీయస్థాయిలో 100 మంది శిక్షకులు ఉంటారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు 30కి పైగా ప్రశ్నలు అడిగి పౌరుల నుంచి సమాధానం రాబడతారు. వారు ఎలాంటి ఇంట్లో ఉంటున్నారు? ఇంట్లో ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉందా? వాడే వాహనాలేంటి? తినే తిండి, నీటి వనరులేంటి? ఇంటి పెద్ద స్త్రీయా? పురుషుడా? తదితర వివరాలను ఈ గణనలో భాగంగా సేకరించనున్నారు. ప్రజల నుంచి సమాచారం సేకరించే సమయంలోగానీ, ప్రసార సమయంలోగానీ, భద్రపరిచాకగానీ.. ఎక్కడా లీక్ కాకుండా అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

**2020లో వాయిదా..**


సాధారణంగా కేంద్రం పదేళ్లకొకసారి జనాభా లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతుంది. అలా స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటిదాకా ఏడుసార్లు జనగణన చేపట్టారు. చివరిసారిగా 2011లో.. జనాభాను లెక్కించారు. ఆ తర్వాత పదేళ్లకు.. అంటే 2021లో మళ్లీజనగణన చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో 2020లో అందుకు సంబంధించిన సన్నాహాలు చేశారు. ఆ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొన్ని రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పనులు చేపట్టడానికి ప్రణాళికలు కూడా రూపొందించారు. కానీ.. కొవిడ్ కారణంగా జనగణన కార్యక్రమం వాయిదా పడింది. కాగా.. 2021 జనాభా లెక్కల ఆధారంగా.. జాతీయ జనాభా పట్టికను (ఎన్‌పీఆర్) సైతం నవీకరించాలని 2020లో నిర్ణయించిన సర్కారు.. తాజా నోటిఫికేషన్‌లో దాని గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇక.. జనగణనలో భాగంగానే కులగణన కూడా చేపట్టనున్నట్టు కేంద్ర మంత్రివర్గం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా.. జనాభా లెక్కల సన్నాహాలపై ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరిగింది. అందులో కేంద్ర హోం కార్యదర్శి, రిజిస్ట్రార్ జనరల్, భారత్ జనాభా లెక్కల కమిషన్ (ఆర్జీ, సీసీఐ), ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ భేటీ దరిమిలా సోమవారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

**ఇది మరో యూ టర్నా?**

జనగణనకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఎక్కడా కుల గణన ప్రస్తావనే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రస్తావన లేకపోవడమంటే.. మోదీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకోవడమేనని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. కుల గణన చేయాలన్న కాంగ్రెస్ నాయకులను మోదీ అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారని.. పార్లమెంటులో, సుప్రీంకోర్టులో కుల గణనను తిరస్కరించారని గుర్తు చేశారు. వాటన్నింటి నేపథ్యంలో ఇది మరో యూ టర్న్ అవుతుందా? లేక వివరాలు తర్వాత ప్రకటిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. జనభా లెక్కింపు కేవలం కుల గణనే కాకుండా కులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయలతో కూడిన వివరణాత్మ సమాచారంతో ఉండాలని, తెలంగాణ నమూనాను అనుసరించాలని సూచించారు. కేవలం కులాల వివరాలు సేకరించడంతో సరిపెట్టకుండా.. తెలంగాణ తరహాలో కులాలవారీగా సామాజిక, ఆర్థిక వివరాలు కూడా సేకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కాగా.. జైరామ్ రమేశ్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. కులగణన కూడా జనగణనలో భాగంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30న, జూన్ 4న, జూన్ 15న వెల్లడించినట్టు గుర్తుచేశారు.

# దయచేసి ఆపండి..
# ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఎయిరిండియా బాధిత కుటుంబం విజ్ఞప్తి

**ఇంటర్‌నెట్ డెస్క్:** అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో 241 మంది విమాన ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఓ వైపు ప్రమాదంలో తమ వారు ప్రాణాలు కోల్పోయారనే షాక్ నుంచి ఇప్పటికీ వారి కుటుంబ సభ్యులు తేరుకోలేకపోతున్నారు. తమ వారి మృతదేహాల కోసం తిండీ నిద్రా లేకుండా ఘటనా స్థలంలో నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు మృతులకు సంబంధించిన ఫొటోలు, పలు వీడియోలను ఉపయోగించుకొని పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్లు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుండడంతో విసుగు చెందిన మృతుల కుటుంబసభ్యులు ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాజస్థాన్‌లోని బాన్స్‌వాడకు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ భార్యాపిల్లలతో విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబానికి చెందిన ఫేక్, ఫొటోలను పలువురు నెటిజన్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని కోమి వ్యాస్ బంధువు కుల్దీప్ భట్ ఆరోపించారు. లైక్స్, వ్యూస్ కోసం ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. "మా కుటుంబానికి వచ్చిన కష్టంతో ఇప్పటికే మేమంతా మానసికంగా కుంగిపోయి ఉన్నాం. మాలాగే మరో 270కి



పైగా కుటుంబాలు తమ వారిని కోల్పోయి విచారంలో మునిగిపోయి ఉన్నాయి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి లైక్‌లు, కామెంట్ల కోసం ప్రమాదానికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేస్తున్నారు. కోమి కుటుంబం విమానం ఎక్కగానే దిగిన ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ ఫొటో నుంచి ఏఐ వీడియోలు చేస్తున్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుమార్తె మిరియా (8)కు చెందినదని ఓ మృతదేహం ఫొటోను షేర్ చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆమెకు దహన సంస్కారాలు చేస్తున్నట్లు మరికొన్ని వీడియోలు కూడా పెడుతున్నారు. చిన్నారి శరీరం పూర్తిగా కాలి బూడిదయ్యిందని వదంతులు సృష్టిస్తున్నారు. కోమి పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు తెరిచి.. వారి ఫొటోలు దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి మృతదేహాలు కూడా దొరకకపోవడంతో శోకసంద్రంలో మునిగిపోయి ఉన్నాము. లైకుల కోసం తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చేస్తూ.. మమ్మల్ని మరింత క్షోభకు గురిచేయకండి" అని విజ్ఞప్తి చేశారు. గురువారం మధ్యాహ్నం 1.38 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానాశ్రయానికి సమీపంలో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస ప్రాంతం వద్ద కూలిపోవడంతో మొత్తం 274 మంది మృతిచెందారు. రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ ఇటీవలే లండన్‌కు వెళ్లారు. తన కుటుంబాన్ని కూడా లండన్‌కు తీసుకెళ్లేందుకు ప్రమాదం జరగడానికి రెండు రోజుల క్రితమే ఇండియాకు తిరిగివచ్చారు. ఎన్నో ఆశలతో కుటుంబమంతా కలిసి లండన్‌కు బయలుదేరగా ఈ ప్రమాదంలో వారంతా ప్రాణాలు కోల్పోయారు.

## విద్యార్థులు తగ్గుతున్నారు

నల్లగొండ

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం కలగడం లేదు. దీంతో ప్రభుత్వ స్కూళ్లకు మూసివేత ప్రమాదం పొంచి ఉంది. గడిచిన నాలుగేళ్లలో ఒక్క నల్లగొండ జిల్లాలోనే 310 వరకు స్కూళ్లు జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడ్డాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంతో గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సర్దుబాటు చేయగా దాదాపు 1,980 స్కూళ్లు మూతపడ్డాయి. ఇక విద్యా సంవత్సరంలోనూ మరిన్ని స్కూళ్లపైనా మూసివేత కత్తి వేలాడుతోంది. సిద్దిపేట జిల్లాలో 12 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఈసారి తెరుచుకున్నాయి. అక్కన్నపేట మండలం రేగొండ ప్రాథమిక పాఠశాల గత ఏడాది జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడింది. టీచర్లు గ్రామంలో అవగాహన కల్పించి 35 మంది విద్యార్థులను చేర్పించారు. ఆ పాఠశాలను ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

**అత్యధికంగా వరంగల్‌లో మూసివేత**

2024%–%25 విద్యా సంవత్సరంలో అత్యధికంగా వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి. 135 స్కూళ్లు విద్యార్థుల్లేక, తక్కువ మంది (పది మందిలోపే) విద్యార్థులు ఉండటంతో టీచర్లు, విద్యార్థుల సర్దుబాటుతో అవి మూత పడ్డాయి. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో 94 స్కూళ్లు మూతపడ్డాయి. నల్లగొండ జిల్లాలో 24, మంచిర్యాల జిల్లాలో 32, ఆసిఫాబాద్‌లో 34, నిర్మల్‌లో 48, నిజామాబాద్‌లో 38, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 89, కరీంనగర్ జిల్లాలో 50, రాజన్నసిరిసిల్లలో 18, జగిత్యాలలో 61, పెద్దపల్లిలో 29, హనుమకొండలో 41, మహబూబ్‌నగర్ జిల్లాలో 48, నాగర్‌కర్నూల్‌లో 15, వనపర్తిలో 33, గద్వాలలో 4, నారాయణపేటలో 37 స్కూళ్లు మూత పడ్డాయి.

**మూడేళ్లలో గణనీయంగా తగ్గిన విద్యార్థులు**

ప్రభుత్వ పాఠశాలలు మూత పడుతూనే ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. గడిచిన మూడేళ్ల గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. విద్యాశాఖ లెక్కల ప్రకారమే 2022%–%23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 30,09,212 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం వారి సంఖ్య 23,71,772కు తగ్గిపోయింది. అదే క్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ర్థుల సంఖ్య 37,26,220కి పెరిగింది.

**ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో పెరిగిన విద్యార్థులు**

ఖమ్మం జిల్లాలోనూ రామలింగాలపల్లి క్రాస్ రోడ్డు, ఆలియాతండా, గంగారంతండా కొత్తతండా పాఠశాలలు మూతపడ్డాయి. అయితే ఓవరాల్‌గా చూస్తే ఈ మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రైవేటు స్కూళ్లలోనూ రెట్టింపు స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2022%–%23లో ప్రభుత్వ స్కూళ్లలో 1,08,715 మంది విద్యార్థులు ఉంటే వారి సంఖ్య 2024%–%25లో 1,10,934కు పెరిగింది. ప్రైవేట్ స్కూళ్లలో గతంలో 1,22,781 మంది ఉంటే 1,26,421కి పెరిగింది.

**ఏటేటా పెరుగుతున్న జీరో ఎన్‌రోల్‌మెంట్**

ప్రభుత్వ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఏటేటా పెరుగుతోంది. అక్కడక్కడ బడిబాటలో టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ఒకటీ రెండు మూత పడిన స్కూళ్లను తెరిపిస్తున్నా, వందల సంఖ్యలో మూత పడుతూనే ఉన్నాయి. 2021%–%22 విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య 1,086 ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య రెట్టింపునకు దగ్గరైంది.

జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య 2022%–%23 విద్యా సంవత్సరంలో 1,307కు పెరగగా, 2023%–%24 సంవత్సరంలో 1,745కు, 2024%–%25 సంవత్సరంలో వాటి సంఖ్య 1,980కి పెరిగింది.

ఈ నెల 19 వరకు నిర్వహించే బడిబాట తర్వాత వాటిల్లో ఎన్ని తెరుచుకుంటాయో, ఈసారి ఎన్ని స్కూళ్లు మూత పడతాయో త్వరలోనే తేలనుంది.

## కడసారి చూపులకు నిరీక్షణ

అహ్మదాబాద్

ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఆప్తుల్ని కోల్పోయిన కుటుంబాలకు మృతదేహాలను అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. విమానంలోని 1.25 లక్షల లీటర్ల ఇంధనానికి మంటలు అంటుకోవడంతో మృతదేహాలు చాలావరకు కాలిపోయిన విషయం తెలిసిందే. దీంతో వారి గుర్తింపునకు డీఎన్‌యే పరీక్షలపైనే ఆధారపడుతున్నారు. ఇవి 72 గంటల్లో పూర్తవుతాయని అధికార వర్గాలు తొలుత ప్రకటించినా అంతకంటే ఎక్కువ సమయమే తీసుకుంటోంది. సోమవారం సాయంత్రానికి 119 మృతదేహాల గుర్తింపు పూర్తయింది. గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపాణీ సహా 76 మృతదేహాలను కుటుంబికులకు అప్పగించారు. రూపాణీ మృతదేహాన్ని సోమవారం ప్రత్యేక విమానంలో రాజ్‌కోట్‌కు తరలించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, సి.ఆర్.పాటిల్, ముఖ్యనేతలు, పెద్దఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల పొడవునా బారులుతీరి నివాళులర్పించారు. మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డీఎన్‌యే ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. కణజాలం దెబ్బతినడం, మృతుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్లనే డీఎన్‌యే నివేదికలు ఆలస్యమవుతున్నాయని హైదరాబాద్‌లోని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్ర అభిప్రాయపడుతున్నారు. విమాన ప్రమాదం వల్ల చనిపోయిన వైద్యులు, వైద్య విద్యార్థులకు ఎన్నారై వైద్యుడు డాక్టర్ శంషేర్ వయాలిల్ (అబుధాబీ) రూ.6 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఎయిరిండియా విమానం అమెరికాలో తయారుకావడంతో ప్రమాదంపై ఆ దేశ 'జాతీయ రవాణా భద్రత మండలి' (ఎన్‌టీఎస్‌బీ) కూడా సమాంతర విచారణ మొదలుపెట్టింది.


## 'భయంతో చచ్చిపోతున్నాం'



**ఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. బాంబు దాడుల కారణంగా భయాందోళన వాతావరణం నెలకొంది. మరోవైపు.. ఇజ్రాయెల్‌లో ఉన్న వివిధ దేశాల ప్రజలు ఎప్పుడేం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులకు తరలించేందుకు ?కేంద్రం ఆపరేషన్ చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఇరాన్‌లో విదేశీయుల తరలింపునకు ఆ దేశ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ చేపట్టనుంది. ఇరాన్‌లో సుమారు పదివేల మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది. ఆపరేషన్ పేరుతో ఖరారు చేయాల్సి ఉన్నట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం గగనతలం మూసివేసినందున.. భూసరిహద్దుల మీదుగా విదేశీయులకు తీసుకెళ్లొచ్చని ఇరాన్ విదేశీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇరాన్‌లో తమ పరిస్థితి దినదినగండంగా ఉందని భారతీయ విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీలైనంత త్వరగా తమను స్వదేశానికి తీసుకెళ్లాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వైద్య విద్యార్థి ఇంతిసాల్ మొహిదీన్ మాట్లాడుతూ..'శుక్రవారం తెల్లవారుజామున భారీ పేలుడు శబ్దాలతో నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచా. నాతోపాటు చాలామంది బేస్‌మెంట్‌కు పరుగులు తీశాం. అప్పటినుంచి మాకు నిద్ర లేని రాత్రులే మిగిలాయి.

# వీరోచిత పోరాటంలో వీరమరణం పొందిన రోజు

బ్రిటీష్ పరిపాలనాకాలంలో వారి ఆకృత్యాలను అణిచివేసి, దేశాన్ని స్వాతంత్ర్యం దిశగా తీసుకెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులతోపాటు వీరవనితలు ఎందరో వున్నారు. ఓవైపు విదేశీ పాలకులతో పోరాడుతూనే.. మరోవైపు ప్రజారంజకంగా పాలించిన మహారాణులు మన దేశంలో జన్మించారు. అలాంటి వారిలో ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి ఒకరు. దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళా సైన్యాన్ని తయారుచేసిన ఘటన ఆమెది. ఈమె జీవించింది కేవలం 23 సంవత్సరాలే అయినప్పటికీ.. ఆమె అందించిన స్ఫూర్తి నేటికీ యువతలో ఉత్తేజాన్ని నింపుతోంది. ఝాన్సీ లక్ష్మీబాయి' అసలు పేర మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరము నవంబరు నెల19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమి నాడు జన్మించింది. డీ.బీ పరాస్నిస్ అనే చరిత్రకారుడు రాణీ నవంబర్ 19, 1835 వసంవత్సరంలో జన్మించినట్లు ఆమె జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. కానీ దీనికి వేరే చారిత్రక ఆధారాలు లేకపోవడం వలన 1828 అన్ని చోట్లా ఆమోదింపబడుతున్నది. దీనికి ఆధారం 1854లో జాన్ లాంగ్ అనే ఆంగ్లేయుడు రాణిని కలవడానికి వెళ్ళినపుడు ఆమె తరుపు గుమస్తా ఆయనకు రాణీ 26 ఏళ్ళ స్త్రీ అని చెప్పడం జరిగింది. ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయి లు. వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. ఆమె తల్లి చాలా తెలివైనది మరియు ఆధ్యాత్మిక దోరణి మెండుగా కలదు. ఈమె పేరు మణికర్ణిక కాగా ఆమె ను ముద్దుగా మను అని పిలుచుకునేవారు. ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉండగానే కన్ను మూసింది. దాంతో ఆమెను పెంచాల్సిన బాధ్యత తండ్రి మీద పడింది. బాల్యంలోనే గుర్రపు స్వారీ, కత్తిసాముల్లో ఆరితేరింది. ఈమెకు 13 ఏళ్ళ వయసులోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. ఆ పెళ్ళి తర్వాత ఈమె జీవితం పూర్తిగా మలుపు తిరిగింది. ఈమె 17వ ఏటలో వున్నప్పుడు 1851లో ఓ కుమారునికి జన్మనివ్వగా.. నాలుగు నెలల వయసులోనే ఆ బాలుడు మరణించాడు. దీంతో లక్ష్మీబాయి దంపతులు 'దామోదరరావు' అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. ఆ దత్తతను ఆమోదించా ల్సిందిగా బ్రిటీష్ వారికి వారు అర్జీ కూడా పెట్టుకున్నారు.




అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో 1953నవంబర్ 21 లో గంగాధరరావు మరణించాడు. దీంతో రాజ్యపాలన మొత్తం లక్ష్మీబాయి మీదే పడింది. ఆ తర్వాత లక్ష్మీబాయికి కష్టాలు మరిన్ని ఎక్కువయ్యాయి. ఆనాటి బ్రిటీష్ గవర్నర్ అయిన డల్హౌసి... లక్ష్మీబాయి భర్త గంగాధర మరణించడంతో దామోదరరావును దత్తత తీసుకోవడం చెల్లదని, రాజ్యాన్ని బ్రిటీష్ వారికి స్వాధీనం చేసి వెళ్లాలని ఆమెని ఆదేశించాడు. అందుకు ఆమె ఏమాత్రం ఒప్పుకోలేదు. దీంతో బ్రిటీష్ వారు తమదైన పన్నాగాలు పన్ని, ఝాన్సీ రాజ్యంపైకి సరిహద్దు రాజ్యపాలకులను రెచ్చగొట్టింది. ఈ విషయాన్ని పసిగట్టిన లక్ష్మీబాయి.. తన రాజ్య సంరక్షణ కోసం నడుం బిగించి పెద్దఎత్తున సైన్యాన్ని తయారుచేసింది. ఇందులో భాగంగానే మహిళలకు సైతం శిక్షణనిచ్చి వారిని సైన్యంలో చేర్చుకుంది. ఈ సమయంలోనే ఆమె భారత స్వాతంత్ర్యంపై చైతన్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఆమె సిపాయి ఉద్యమంలో పాలుపంచుకుంటున్న నానాసాహెబ్, రావుసాహెబ్, తాంతియా తోపేలతో చేతులు కలిపింది. ఇంతలోనే బ్రిటీష్ సేనలు ఝాన్సీలో ప్రవేశించి ప్రజల్ని నానా ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టాయి.

ఝాన్సీకి స్వేచ్ఛ కలిగించి లక్ష్మీబాయి ని స్వతంత్రుపరురాలు చేయటానికి తిరుగుబాటు దార్ల నాయకుడైన తాత్యా తోపే ఆధ్వర్యములో 20,000 మంది సైన్యం పంపబడింది. అప్పుడు బ్రిటిష్ వాళ్ళ దగ్గర 1,540 సిపాయిలు మాత్రమే ఉన్నప్పటికీ.. వీళ్ళు చాలా శిక్షణ పొందినవాళ్ళు కావడంతో అనుభవం లేని తోపే సిపాయిలు పారిపోయారు. లక్ష్మిబాయి బలగాలు బలహీనమవడంతో మూడు రోజుల తరువాత బ్రిటిష్ వాళ్ళు నగర గోడలను చీల్చుకొని నగరాన్ని ఆక్రమించుకోగలిగాయి. ఆమె తన రక్షకులు చుట్టూ ఉండడంతో ఆ రాత్రి గోడ దూకి నగరం నుంచి పారిపోగలిగింది. బ్రిటిష్ సైన్యం క్రమంగా ఝాన్సీని ముట్టడించడం ప్రారంభించింది. రెండు వారాల పోరాటం తర్వాత ఆంగ్లేయులు నగరాన్ని చేజిక్కించుకోగలిగారు. కానీ రాణి మాత్రం మగ వేషంలో దత్తత తీసుకున్న చిన్న బిడ్డను వీపున తగిలించుకుని వారి కన్నుగప్పి పారిపోయింది. కల్పి అనే ప్రదేశానికి చేరుకుని తాంతియా తోపే అనే విప్లవ కారుణ్ణి కలుసుకోగలిగింది.

తాత్యా తోపే ఉండే తిరుగుబాటు దారులతో చేరింది. రాణి, తాత్యా తోపే గ్వాలియర్ కు వెళ్లి తమ తిరుగుబాటు బలగాలను ఒకటి చేసి గ్వాలియర్ మహారాజ సైన్యాన్ని ఓడించి తమ బలగాలతో వాళ్ళను పూర్తిగా నశించి పోయేలా చేసారు. తరువాత వాళ్ళు కపటోపాయముతో గ్వాలియర్ కోటను ఆక్రమించుకొన్నారు. కాని.. 1858 జూన్ 17వ తేదీన రెండో రోజు యుద్ధంలో రాణి మరణించింది. ఆమె బుల్లెట్ గాయాలు తగిలి మరణించిందని సమాచారం. ఇలా ఈ విధంగా రెండు వారాలపాటు విదేశీ సైన్యంతో వీరోచితంగా పోరాడి, వీరమరణం పొందింది.

# చిత్రపతి శివాజీ బొమ్మల సేన

బొమ్మలు నిర్భయ ప్రకాశికలు. తెగువకి, ఎదురీతకి, నిలదీతకి నిజదర్శనాలు. ఒంటి రేఖాచిత్రమైనా సరే... కోటి సిపాయిల బలగాన్ని మించిన శక్తివంతం. ఒక వ్యంగ్యచిత్రం లక్ష అక్షరాలలో పొదిగిన భావానికంటే కూడా మహా మిన్న. వందశాతం గురి తప్పని బాలిస్టిక్ క్షిపణితో సమానం. ఇవి అతి శయోక్తులు కావు. క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు. పైకి వినిపించకపోవచ్చును గానీ బొమ్మలు మనతో సంభాషిస్తాయి. మనలోని ఖాళీలను ప్రేమతనంతో నింపుతాయి. శైశవ గీతాలకి కోరస్ ఇస్తాయి. మనసుకి గాయమైతే మందు పూస్తాయి. నిస్పృహ పుటని మూసేసి ఆశల మీటని సుతారంగా తడతాయి. ఈ ఊరడింపే కళా ప్రయోజనానికి సూచిక. ఈ వరుసలో ఇప్పుడు తలుచుకోవలసిన ముఖ్యులు తల్లావజుల శివాజీ. ఆయన సీనియర్ పాత్రికేయుడు, చిత్రకారుడు, రచయిత, కళా విమర్శకుడు. ఆయన రాతలో, గీతలో హాస్యమూ, సున్నితత్వమూ సమతూకంలో ఒదిగిపోతాయి. విషయం ఎంత గాఢమైనదైనా ఇట్టే జీర్ణమైపోవడం ఆయన చిత్రాల స్వభావం. ఒకానొక కాలంలో ఆర్టిస్ట్ రాజుతో కలిసి ఆయన సృష్టించిన 'లింగా ది గ్రేట్' కార్టూన్ కదంబం సూపర్ డూపర్ హిట్. అంతకంటే ముందే 'ఆ నీలి నగరిలో' పేరుతో శివాజీ ఒక నవలిక రాశారు. నగరానికి వచ్చిన ఒక బాలుడి జీవితంలో జరిగే సంఘటనలే ఇందులో కథాంశం. పిల్లల కోసమే శివాజీ ఎక్కువ ఆలోచిస్తారనడానికి ఇది మరొక దాఖలా. ప్రస్తుత ప్రస్తావనకి హేతువు కూడా ఇక్కడే ఉంది. గాజాలో గత కొన్ని నెలలుగా సాగుతున్న భీకర దాడుల్లో అసంఖ్యాకంగా పిల్లలు మరణించారు, మరణిస్తున్నారు. గాయపడ్డ చిన్నారుల సంఖ్య అంతకు అనేక రెట్లు అధికం. తప్పొప్పుల లెక్కలను అలా ఉంచితే, ఏ యుద్ధంలో అయినా అతిగా ఛిద్రమయ్యేది పిల్లలు, స్త్రీలు, వృద్ధుల జీవితాలే. గాజాలో ఇజ్రాయిల్ దళాల దాడుల్లో సాగుతున్న శిశువధ పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయిల్ పౌరసమాజం కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సందర్భాలున్నాయి. ఎక్కడికక్కడ కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, చిత్రకారులు సహా వివిధ శ్రేణులవారు రకరకాల రూపాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తల్లావజుల శివాజీ డజను వరకు చిత్రాలు వేశారు. 'ఓ.. నౌ వెకేట్ గాజా లిటిల్ డియర్', 'ప్లాంట్ హోప్ ఏ గాజా', 'ఐ లవ్ వార్ ఎనీవేర్', 'లెట్ దేర్ బి హోప్.. గాజా', 'వెయిట్ యు విల్ హావ్ సమ్ మోర్.. గాజా' వంటి క్యాప్షన్స్‌తో శివాజీ వేసిన ఈ చిత్రాలు కార్టూన్ శైలిలో ఉన్నప్పటికీ, వ్యంగ్యం కంటే విషాదస్పర్శే మనసుని తాకుతుంది. జెరూసలెంలోని హిబ్రూ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డేవిడ్ షుల్మన్ ఇండియన్ స్టడీస్‌లో తులనాత్మక మత అధ్యయనం విభాగంలో ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేశారు. ఆయన కవి, చరిత్రకారుడు, ఇండాలజిస్ట్ కూడా.



దక్షిణ భారత మత చరిత్ర, భారత రాజకీయాలు, ద్రవిడ భాషాశాస్త్రం, కర్ణాటక సంగీతం వంటి అంశాలలోనూ ఆయన నిష్ణాతులు. తమిళ, తెలుగు, హిందీ, సంస్కృత భాషల్లో పట్టున్న విద్యాధికుడు, –పీస్ యాక్టివిస్ట్ కూడా. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆ దేశ పౌరసమాజంతో కలిసి అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారాయన. శివాజీ సోదరులు తల్లావజుల పతంజలిశాస్త్రికి షుల్మన్‌తో స్నేహ సంబంధాలు ఉండటంతో శివాజీ వేసిన చిత్రాలను షుల్మన్‌కి పంపించారు పతంజలిశాస్త్రి. వాటిని చూసిన షుల్మన్ ఎంతో ఆసక్తి కనబరిచి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇజ్రాయిల్ పాలకుల వైఖరిని నిరసించే అక్కడి పౌరసమాజ ప్రముఖుడి ప్రశంసలందుకున్న చిత్రాలు ఈ శివాజీ బొమ్మలు. గాజాపై సాగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని లా మకాన్‌లో 'హైదరాబాద్ ఫర్ ద చిల్డ్రన్ ఆఫ్ గాజా' పేరుతో ఒక కార్యక్రమం జరుగుతున్నది. ఇందులో కవి గాయకులు, చిత్రకారులు, కళాకారులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నారు. ఈ తరుణంలో శివాజీపై గౌరవంతో ఆయన చిత్రాలను పోస్టర్లుగా తీర్చి ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. యుద్ధ వ్యతిరేక చిత్రకారుడు, చిన్నారుల శ్రేయోభిలాషి శివాజీకి అభినందనలు.

# ఇరాన్,ఇజ్రాయిల్ వార్..... ఏం జరుగుతోంది

ఇరాన్‌పై దాడులకు ఆ దేశ అణు కార్యక్రమాలే కారణమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. అవి తమ దేశ మనుగడకు ముప్పు అని తెలిపారు. కానీ దీని వెనుక ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమనే విస్తృత లక్ష్యం కూడా ఉన్నట్టుంది. ఈ దాడుల వల్ల ఉత్పన్నమయ్యే వరుస పరిణామాలు ప్రజలలో అశాంతిని రేకెత్తించి ఇరాన్ పాలకుల పతనానికి దారితీస్తాయని ఆయన ఆశిస్తున్నారు. ఇరాన్ ప్రజలు కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది, మీ గర్వించదగ్గ చరిత్రను తలుచుకొని, ఈ క్రూరమైన, కఠినమైన ప్రభుత్వం నుంచి స్వేచ్ఛ కోసం పోరాడాలి" అని పిలుపునిచ్చారు. ఇరాన్ ఆర్థిక దుస్థితి, భావప్రకటన స్వేచ్ఛ కొరవడటం, మహిళలు, మైనారిటీ వర్గాల హక్కులను పరిమితం చేయడంపై చాలామంది ఇరాన్ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. ఇజ్రాయెల్ దాడి ఇరాన్ నాయకత్వానికి నిజమైన ముప్పుగా పరిణమిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్, ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు మరణించారు. అయితే, ఇజ్రాయెల్ దాడులు ఇంకా ముగియలేదు. ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు, లక్ష్యాలపై దాడి చేసినట్లు రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. ఇరుదేశాలు దాడులకు దిగడంతో , పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ క్షిపణి దాడుల తర్వాత, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు "మరికొన్ని దాడులు చేస్తాం" అని హెచ్చరించారు. ఇరాన్‌లోని కొందరు నాయకులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోవచ్చు. ఈ దాడులు ఇరాన్ ప్రభుత్వాన్ని కదిలించి, ప్రజలు పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని ఇజ్రాయెల్ ఆశిస్తూ ఉండవచ్చు. నెతన్యాహు కోరుకుంటున్నది ఇదే. కానీ ఇదొక జూదం – చాలా పెద్దది. ఎందుకంటే, అటువంటిది జరుగుతుందని స్పష్టమైన సంకేతం లేదు. నిరసనలు ప్రారంభమైనప్పటికీ, ఇదంతా ఎక్కడికి వెళుతుందో తెలియదు. ఇరాన్‌లో సైన్యాన్ని, ఆర్థిక వ్యవస్థను నియంత్రించే వారి చేతుల్లోనే నిజమైన అధికారం ఉంది. ఇందులో ఎక్కువగా ఐఆర్‌జీసీకి చెందిన వారు, ఇతర ఎన్నిక కాని గ్రూపుల వారున్నారు. వారు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవలసిన అవసరం లేదు, ఎందుకంటే, అది ఇప్పటికే వారి చేతుల్లో ఉంది. వారు మరింత దూకుడుగా స్పందించవచ్చు. ప్రస్తుత సంక్షోభానికి మరొక ఫలితం ఏమిటంటే, ఇరాన్ ప్రభుత్వం కూలిపోయి, దేశాన్ని గందరగోళంలో పడేయవచ్చు. ఇరాన్‌లో దాదాపు 9 కోట్ల జనాభా ఉంది, కాబట్టి ఇక్కడి విషయాలు మిడిల్ ఈస్ట్ అంతటా ప్రభావాన్ని చూపవచ్చు. ఇరాన్‌లో తిరుగుబాటు వచ్చి, కొత్త, స్నేహపూర్వక ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఇజ్రాయెల్ ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ పెద్ద ప్రశ్న ఏమిటంటే – ఎవరు అధికారం చేపడతారు?. ఇటీవలి సంవత్సరాలలో ఇరాన్ ప్రతిపక్షాలు విడిపోయాయి. 2022లో "స్త్రీ జీవితం, స్వేచ్ఛ" పేరుతో సాగిన ఉద్యమంలోని నిరసనలు ఇరాన్‌ను కుదిపేశాయి. దీంతో ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యతిరేక గ్రూపులను, వ్యతిరేక గళాలను ఏకం చేయడానికి కొంతమంది ప్రతిపక్ష నాయకులు ప్రయత్నించారు. అయితే, వారి ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఉద్యమానికి ఎవరు నాయకత్వం వహించాలి? ప్రస్తుత ప్రభుత్వాన్ని ఏ విధమైన వ్యవస్థ ద్వారా భర్తీ చేయాలి? అనే దానిపై వారిలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు. ఇరాన్ మాజీ క్రౌన్ ప్రిన్స్ రెజా పహ్లావి ఇందుకు ఒక ఉదాహరణ. 1979 ఇస్లామిక్ విప్లవం సమయంలో ఆయన తండ్రి షాను అధికారం నుంచి తొలగించారు. రెజా పహ్లావి ప్రస్తుతం ఇరాన్ బయట నివసిస్తున్నారు. ఇతర దేశాల మద్దతు కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో రెజా ఇజ్రాయెల్‌ను కూడా సందర్శించారు .కొంతమంది ఇరానియన్లు రెజాకు మద్దతు ఇస్తున్నప్పటికీ, అది ఇరాన్ ప్రభుత్వంలో త్వరగా మార్పు తీసుకురావడానికి తగినంత బలంగా ఉందో లేదో స్పష్టంగా లేదు. ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు. బహిష్కరణకు గురై, ప్రవాసంలో ఉంటున్న ముజాహిదీన్–ఇ ఖల్క్ (ఎంఈకే) అనే ఒక ప్రతిపక్ష గ్రూపు కూడా ఉంది. వారు ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వాన్ని దించాలని కోరుకుంటున్నారు కానీ, రాచరిక పాలనను వ్యతిరేకిస్తున్నారు. ఎంఈకే ఒక వామపక్ష ముస్లిం గ్రూపుగా ప్రారంభమైంది, ఇరాన్ మాజీ రాజు (షా)ను తీవ్రంగా వ్యతిరేకించింది. 1979 విప్లవం తర్వాత ఈ గ్రూపు ఇరాక్‌కు వెళ్లింది, 1980లలో జరిగిన ఇరాన్–ఇరాక్ యుద్ధంలో సద్దాం హుస్సేన్ పక్షాన నిలిచింది. ఈ నిర్ణయం వల్ల చాలామంది ఇరానియన్లు ఎంఈకే గ్రూపును వ్యతిరేకించారు. ఎంఈకే ఇప్పటికీ చురుకుగా ఉంది. అమెరికాలో ముఖ్యంగా డోనల్డ్ ట్రంప్‌కు దగ్గరగా ఉన్న కొందరితో స్నేహం ఉంది. ట్రంప్ మొదటి పదవీకాలంలో మైక్ పాంపియో, జాన్ బోల్టన్, రూడీ గియులియాని వంటి సీనియర్ యూఎస్ అధికారులు ఎంఈకే కార్యక్రమాలలో ప్రసంగించారు. అయితే, ఈ గ్రూపుకు ఇప్పుడు వైట్‌హౌస్‌లో తక్కువ ప్రభావం ఉన్నట్లు కనిపిస్తోంది. కొన్నిపార్టీలు లౌకిక ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటుండగా, మరికొన్ని పార్లమెంటరీ రాచరికానికి మద్దతు ఇస్తున్నాయి. ఇక, జూన్ 13 దాడులపై ఇప్పుడే ఓ అంచనాకు రాలేం. గత సంవత్సరం కూడా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం జరిగింది. దాన్ని ప్రభుత్వాన్ని దించడానికి ఒక అవకాశంగా ఇరానియన్లు భావించినట్లు బలమైన సంకేతాలు కనిపించలేదు. ఇజ్రాయెల్‌లోని అనేక లక్ష్యాలను ఇరాన్ ఛేదించినప్పటికీ, దానికి అంత మంచి అవకాశాలు ఉన్నట్లు అనిపించడం లేదు. అమెరికాతో మళ్లీ చర్చలు ప్రారంభించి, ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించడం ఇరాన్‌కు సురక్షితమైన మార్గం అని కొంతమంది భావిస్తున్నారు. కానీ, ఇరాన్ నాయకులకు ఇది ఇబ్బందికరం. ఎందుకంటే, ట్రంప్ డిమాండ్ మేరకు చర్చలకు వస్తే, వారు ఓటమిని అంగీకరించినట్లేనని అనుకుంటారు. ఇరాన్‌కు ఉన్న మరో ప్రత్యామ్నాయం ఏమిటంటే, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా దానిపై దాడి చేస్తూ ఉండటం. ప్రస్తుతం వారు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నది ఇదే అనిపిస్తోంది. ప్రతీకారం తీర్చుకుంటామని తమ మద్దతుదారులకు ఇరాన్ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే కొనసాగిస్తే, ఇజ్రాయెల్ ప్రతిస్పందన దాడులకు దిగవచ్చు. ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ గతంలో కూడా బెదిరించింది. కానీ, అదంత సులభం కాదు, అలా చేస్తే అమెరికాను నేరుగా ఈ వివాదంలోకి లాగినట్లవుతుంది, ఈ పరిణామం తలెత్తకుండా ఇరాన్ నిజంగా నివారించాలనుకుంటోంది. ఈ ప్రత్యామ్నాలు ఏవీ సులభం కాదు, ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవడం కష్టం. పరిస్థితులు ఇప్పటికీ అనిశ్చితంగానే ఉన్నాయి. స్పష్టంగా కనిపించే వరకు పూర్తి ప్రభావం తెలియదు.

# రజకులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలి

**జోగులాంబ గద్వాల, ( సూర్య ప్రతినిధి ):** తెలంగాణ అసెంబ్లీలో 2016 డిసెంబర్ 26న రజకుల సంక్షేమం తోపాటు ఎస్సీలో చేర్చాలని నాటి కోడంగల్ ఎమ్మెల్యే హోదాలో మాట్లాడిన నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి రజకుల చిరకాల వాంఛను నెరవేర్చాలని గోపి రజక కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా శాంతి నగర్ లో సోమవారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సి.వెంకటేష్ , మండల అధ్యక్షులు బందెన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక హాజరై మాట్లాడుతూ 18 రాష్ట్రాలలో రజక కులస్తులు ఎస్సీ రిజర్వేషన్ అనుభవిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంటే మిగతా 11 రాష్ట్రాల్లో అందుకు భిన్నంగా ఉండటం చాలా బాధాకరమని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా ఒకే రిజర్వేషన్ ఉండాలన్నా ఉద్దేశంతో 56/1984 ఆర్డినెన్సును జారీ చేసిన 11 రాష్ట్రాలకు అవగాహన లేక, ఆర్డినెన్సు తెలియక చేరలేకపోయిన రాష్ట్రాలను తక్షణమే ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై లోక్ సభలో బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 78 సం.లుగా రజక కులస్తులు ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోకుండా ఎలాంటి ఉద్యమాలు లేకుండానే అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేంద్రం తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ బాటలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమె కలలను సాకారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షులు రామారావు, ప్రచార కార్యదర్శి రాఘవేంద్ర, మాజీ అధ్యక్షులు మద్దిలేటి,తిప్పన్న,వెంకట్రాములు, రామకృష్ణ,నర్సిములు ,భీమన్న,దేవన్న, శ్రీను , వెంకటేష్, రాంబాబు, మల్లేష్,బాల్ రాజ్,జయన్న, దస్తగిరి,పరుశురాములు,ముని, రాజన్న, లక్ష్మణ్, భీముడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు



# ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకస్తున్న మండల విద్యాధికరిపై చర్యలు తీసుకోవాలి





**ట్రినిటీ పాఠశాల లో స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలి**

**ట్రినిటీ గుర్తింపును రద్దు చేయాలి**

**మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్**

**చౌటుప్పల్, ( సూర్య ప్రతినిధి):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో ట్రినిటీ పాఠశాలలలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫామ్ స్టేషనరీ ఐటమ్స్ అమ్ముతున్నారు విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్ తిగుళ్ళ శ్రీనివాస్ అన్నారు ... సోమవారం రోజున ట్రినిటి ప్రవేటు విద్యా సంస్థ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేట్ విద్యాసంస్థలు అక్రమంగా లు అమ్ముతూ లక్షల రూపాయలు విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారు తరచుగా అంతేకాకుండా 15000 నుంచి 35000 వరకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ పేరుతో వారి యొక్క కళాశాల పాఠశాల పేర్లు ముద్రించి అమ్ముతున్నారు. ఇలా తరచుగా జరుగుతున్నటువంటి పాఠశాల కళాశాలల పైన ఎటువంటి విద్యాశాఖ అధికారులు కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇప్పటివరకు జోక్యం చేసుకోకుండా నిద్రిస్తున్నారు. మండలంలో ఉన్నటువంటి ఎంఈఓ ప్రైవేట్ స్కూళ్లకు కొమ్ము కాస్తూ స్టేషనరీ వ్యాపారని నడుపుతున్న గాని నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారు మండలంలో ఉన్నటువంటి విద్యాధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలి స్టేషనరీ వ్యాపారం నరికట్టాలి చేయని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం జిల్లా విద్యాధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సాతిరి మనోజ్ మండల ఉపాధ్యక్షుడు దోనూరు శ్రావణ్ ,బండారి విక్రమ్,మండల కమిటీ సభ్యులు,మణికంఠ,సందీప్ ,జయంత్ ,రాము,మహేష్,శ్రావణ్ ,తదితరులు పాల్గొన్నారు...

# ప్రజల బాగస్వామ్యంతోనే వంద రోజుల ప్రణాళిక విజయవంతం





**పిర్జాదిగూడ,జూన్ 16, ప్రభాత సూర్య:** పీర్జాదిగూడ నగరపాలక సంస్థ అన్ని వార్డులలోని ప్రజలంతా 100 రోజుల ప్రణాళికలో భాగస్వాములై విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ %యూఎచ్% త్రిల్లేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ పరిధిలోని పీర్జాదిగూడ ఓల్డ్ విలేజ్, క్రాంతి కాలనీ, బుద్ధ నగర్ సాయి ఐశ్వర్య కాలనీలలో ఇంటింటి చెత్త సేకరణ మరియు వేరు చేయు విధానం వీధి కుక్కల నియంత్రణ,దోమల నియంత్రణ మరియు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలనేది , ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏడో వార్డులోని గాయత్రి నగర్ ఫేస్ 2 లో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ కార్యక్రమాలు అమలుపై పరిశీలనకు వచ్చిన %జణహీూ% కార్యాలయం నుండి రాజేష్, ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభా శంకర్, డిప్యూటీ ఇంజనీర్ సాయినాథ్ గౌడ్, మేనేజర్లు క్రాంతి కుమార్, కిషోర్, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,జవాన్లు, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వండి

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కోరిన ప్రెస్ కమిటీ సభ్యులు.**

**సూర్య ప్రతినిధి వనపర్తి** జిల్లాలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల వాహనాలకు గుర్తింపుగా ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వాలని ప్రెస్ కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కలిసిన ప్రెస్ కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రెస్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.... విధినిర్వహణలో జర్నలిస్టులకు పోలీసులు విధిస్తున్న ఫైన్ లతో సతమతమవుతున్నారని తెలిపారు. పత్రికా సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల కవరేజ్ చేయడానికి హడావిడిగా వెళుతున్న సందర్భాల్లో విధుల్లో ఉన్న పోలీసులు జర్నలిస్టుల వాహనాలకు ఫైన్ లు వేస్తున్నారని అన్నారు. ఈ సమస్య నుంచి జర్నలిస్టులకు ఉపశమనం కల్పించాలని, అందుకోసం పోలీస్ శాఖ నుంచి ప్రత్యేకంగా రూపొందించిన జర్నలిస్టు ప్రెస్ స్టిక్కర్లను అందించి ఫైన్ ల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. స్పందించిన జిల్లా ఎస్పీ త్వరలోనే జర్నలిస్టు ల వాహనాల కోసం ప్రత్యేకంగా ప్రెస్ స్టిక్కర్లు తయారుచేసి అందిస్తామని భరోసా ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో ప్రెస్ కమిటీ సభ్యులు బోలేమోని రమేష్, బొడ్డుపల్లి లక్ష్మణ్, యాదిరెడ్డి, కుమార్, శేఖర్ యాదవ్, శ్రీనాథ్, పురుషోత్తం, ప్రవీణ్, గోపాలకృష్ణ, తిరుపతి, గట్టు శేఖర్, ముంత రవి, ఫోటో జర్నలిస్ట్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## తుర్క కాశ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**గడ్డం వివేక్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన ఎస్కే బడేసాబ్**




**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి )** తెలంగాణ రాష్ట్ర తుర్క కాశ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వారి క్యాంపు కార్యాలయం సోమాజిగూడలో కార్మిక శాఖ మంత్రి వర్యులు గడ్డం వివేక్ కుమార్ కు తెలంగాణ తుర్క కాశ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే బడేసాబ్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. గడిచిన 10 ఏళ్ల బిఆర్ఎస్ పరిపాలనలో తుర్క కాశ కార్మిక సోదరులకు పట్టించుకునే పాపాన పోలేదు అని ఇప్పుడు ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం లో తుర్క కాశ కార్మికుల సమస్యలను నెరవేర్చాలని అదేవిధంగా ప్రజా పాలన భాగంగా నాలుగు సంక్షేమ పథకాలు. కార్మిక బంధు 10 లక్షల రూపాయలు 45 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికునికి కార్మిక పెన్షన్ ఇవ్వాలని రాయి కొట్టే కార్మికునికి ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినచో అట్టి మెడికల్ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని వారి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు తురక కాశ కార్మికులకు అధికంగా ఇవ్వాలని కోరారు, రేషన్ కార్డులు, వంటి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. అనంతరం మంత్రి గడ్డం వివేక్ కుమార్ సానుకూలంగా స్పందించి తుర్క కాశ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కకాశ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జెండా పండుగ




**చౌటుప్పల్, ( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్ళసింగారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగ ఘనంగా నిర్వహించి సంబరాలు చేసుకోవాలని అన్నారు . అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్ తాళ్ళసింగారం గ్రామ శాఖ అధ్యక్షునిగా దొనకొండ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సుక్క నరసింహ,ప్రధాన కార్యదర్శి దొనకొండ అనిల్, సహాయ కార్యదర్శి దొనకొండ మధు, కోశాధికారి ఊదరి సురేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దొనకొండ కృష్ణ, ఊదరి నరసింహ, సుక్క కృష్ణ, అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ సురేష్, దొనకొండ కృష్ణ, ఊదరి మారయ్య, యాదయ్య, సంజీవ, దొనకొండ అనిల్, సుక్క విగ్నేష్, శంకరులు పాల్గొన్నారు..

## పరామర్శించిన జిల్లాగ్రంధాలయం కమిటీ చైర్మన్ సత్తు మల్లేశం



**రామడుగు, ( సూర్య ప్రతినిధి):** రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామంలో సోమవారం రోజున జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తండ్రి పరుశురాం గౌడ్ అనారోగ్య కారణంగా రెండు రోజుల క్రితం మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లాగ్రంధాలయం కమిటీ చైర్మన్ సత్తు మల్లేశం ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి ముదిరాజ్, మాజీ సర్పంచ్ కోల రమేష్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చెక్ పంపిన చేసిన ఎమ్మెల్యే




**రామడుగు, ( సూర్య ప్రతినిధి):** రామడుగు మండలం వెలిచాల గ్రామంలో సోమవారం రోజున ఇటీవల బైక్ యాక్సిడెంట్లో మరణించగా బాధితని కుటుంబానికి 38 లక్షల టాటా హెల్త్ ఇన్సూరెన్స్ చెక్కును చొప్పదండి నియోజకవర్గం శాసన సభ్యులు మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అందజేశారు అనంతరం టాటా హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీసర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, (మాజీ ఎంపీపీ) మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి ముదిరాజ్, మాజీ సర్పంచ్ కాడే శంకర్, కోల రమేష్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు,అంజనీ ప్రసాద్, జడ్పీ కో ఆప్షన్ శుక్రుద్దీన్, జక్కుల బాబు,సుధీర్, రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ తదితరులు పాల్గొన్నారు

## శానిటరీ జవాన్లు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి



**తుర్కయాంజల్,జూన్ 16, ప్రభాత సూర్య:** శానిటరీ జవాన్లు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి అని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున మున్సిపాలిటీ సిబ్బంది పలు వార్డులలో వాడి పారవేసిన,కొబ్బరి బోండాలు, పాత టైర్ లో నీరు, ప్లాస్టిక్ బాటిల్ లో నిల్వ ఉన్న నీళు ఉండకుండా, చూసుకోవలని, తెలియజేశారు. దోమల నివారణ కొరకు మురికి కాలువలు ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. ప్రజలందరూ తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకి మాత్రమే ఇవ్వవలెనని, స్వచ్ఛ ఆటోలు రానిచో మున్సిపాలిటీ దృష్టి కి తీసుకురావలెనని తెలియజేశారు. ఎవరు కూడా బహిరంగంగా చెత్తను వెయ్యొద్దని అలా చేసినచో జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.పలు కాలనీలో తడి , పొడి హానికర చెత్తను రోడ్డు కి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో శానిటరీ జవాన్ లు అందరూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్య పనులను చేపడుతూ ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## కప్పడ్ గ్రామానికి ప్రతిరోజు బస్సులను నడపాలి



**ఇబ్రహీంపట్నం, జూన్ 16, ప్రభాత సూర్య:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామాన్నికి ప్రతిరోజు బస్సులను నడపాలని సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి జంగాలు ప్రభు దాసు ఆధ్వర్యంలో డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మా గ్రామానికి సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రతిరోజు గ్రామాల నుంచి వివిధ పనుల మీద బయటకి పోయే వారికి తీవ్ర అంతరాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు విద్యార్థులకు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని తెలియజేశారు. లేని ఎడల ఇబ్రహీంపట్నం డిపో వద్ద ధర్నా చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పల్లపు విఘ్నేశ్, మద్దేల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు వెలువ



**తుర్కయాంజల్, జూన్ 16, ప్రభాత సూర్య:** డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యకార శాఖలు, క్రీడలు మరియు యువజన సేవల శాఖల మంత్రిగా వాకిటి శ్రీహరి నియమితులైన సందర్భంగా, సచివాలయంలోని వారి ఛాంబర్‌లో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు





**రామడుగు, ( సూర్య ప్రతినిధి):** రామడుగు మండలం కేంద్రంలో సోమవారం రోజున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, మాట్లాడుతూ మండల అధికారులు గ్రా మాల్లో ప్రతీ ఇంటికి తిరిగి ఎలాంటి రాజకీయ ప్రలోభాలు లేకుండా సరైన లబ్ధిదారులకు మా త్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఎక్కడ కూడా అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు. లబ్ధిదారులు సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకో వాలన్నారు. అంతకుముందు మండల నాయ కులు రామడుగు, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరివేని తిరుమల తిరుపతి ముదిరాజ్, రామడుగు కార్యదర్శి శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ కర్ణ శీను, జెట్టిపల్లి వీరయ్య మూల రమేష్,రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త





రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు

రైతులను నిండా ముంచుతున్న నకిలీ విత్తన మాఫియా

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ... రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా ?

వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యత పైనే పంట దిగుబడి , నాణ్యత,, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి. కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట, వరంగల్, షాద్ నగర్, ఆత్మకూర్ లలో వ్యవసాయ అధికారులు, పోలీసులు జరిపిన సోదాల్లో లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి, ప్రతి సంవత్సర ఇలాంటి సంఘటనలు కోకొల్లలు గా జరుగుతున్నాయి ,ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరా లిఅవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు... మొలక వచ్చినా సరైన దిగుబడి లిరావడం లేదు%ా% చివరికి రైతులకు దిగుబడి నష్టం, అప్పుల భారంతో పాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు

ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉందిలి

నకిలీ విత్తనం అంటే ఏమిటి?

అనంతపూర్, ( సూర్య ప్రతినిధి):

నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వంలి గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి.

**నకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా?**

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంట వేయకముందు రైతు నకిలి విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడాలు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటుకోవాలి.

విత్తనం వేయక ముందు నకిలీ విత్తనాలు గుర్తించడం ఎలా?

రైతులకి మార్గదర్శక సూచనలు

వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.



**అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి**

ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి.

**ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గు చూపండి**

విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హోలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి.

**తక్కువ ధర – అధిక నష్టం!**

మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే మూటలపై మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు.

**బిల్లు తప్పనిసరి!**

విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.

ప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించండి

ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే "పచ్చ రంగు ట్యాగ్" ( ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా "నీలి ట్యాగ్" (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించండి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చ ట్యాగ్ ఉండేలా చూస్తారు.

ట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం

విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు.

మొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి

ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80% కంటే ఎక్కువ, జన్యు శాతం 98% కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2% కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి.

బీటీ విత్తనాల గుర్తింపు – జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి

ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏ సి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం.

ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రాపత్రాలద్వారా న్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని కూడా రైతులు మర్చిపోకూడదు.

పంట కాలంలో నకిలీ విత్తనాలను గుర్తించే సూచనలు:

విత్తనాలు మొలకెత్తకపోవడం %–% నాణ్యమైన విత్తనాలు సగటున 80–90% మొలకెత్తుతాయి. తక్కువ మొలకశాతం నకిలీ విత్తన సంకేతం కావచ్చు.

చెడ్డ మొలకలు %–% మొలకెత్తిన విత్తనాలు సరైన ఎదుగుదల కనబరచకపోవడం.

పూత రాకపోవడం లేదా పూత పూసి రాలిపోవడం %–% చివరికి కాయలుగా మారకపోవడం.

ఇలాంటి లక్షణాలు పంట సమయంలో గమనిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలి.

రైతులు నకిలీ విత్తనాలు ఎందుకు కొనుగోలు చేస్తున్నారు?

**తక్కువ ధరకు లభ్యత**

ఉచిత విత్తన బహుమతుల వంచనలు %–% "మూడు కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం" వంటి లౌకిక మాయాజాలాలు.

సరిగ్గా తెలుసుకోకుండానే ఎంపిక %–% విత్తనాల విషయంలో అవగాహన లోపం.

పెట్టుబడి తగ్గించుకోవాలనే ఉద్దేశం

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం %–% నకిలీ విత్తన వ్యాపారాలపై తగిన చర్యల లోపం.

బిటి (బీటీ) నాన్ బిటి ప్రత్తి విత్తనాలను గుర్తించడం ఎలా?

బిటి ప్రత్తి విత్తనాల్లో జన్యుపరమైన మార్పులతో పురుగు నిరోధకత కలిగి ఉండటం వల్ల ఎక్కువ దిగుబడులు వస్తాయి. అయితే మార్కెట్లో బిటి పేరిట నాన్ బిటి విత్తనాలు కల్తీగా అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

గుర్తింపు కోసం:

"బి టి క్రై 1 ఏ బి/ క్రై 1ఏ సి రాపిడ్ డిటెక్షన్ కిట్స్ అనే స్ట్రిప్ కిట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

రెండు గీతలు వస్తే %–% బిటి విత్తనం

ఒక గీత మాత్రమే వస్తే %–% నాన్ బిటి విత్తనం ఇలా 30 నిమిషాల్లోనే రైతులు తామే పరీక్షించగలుగుతారు.

**విత్తన మొలక శాతం పరీక్షించే సరళమైన పద్ధతులు**

విత్తనం నాణ్యత తెలుసుకోవాలంటే మొలకశాతం పరీక్ష అవసరం. రైతులు ఈ క్రింది పద్ధతుల్లో ఈ పరీక్షలు జరుపవచ్చు:

ట్రే పద్ధతి

ఒక ప్లాస్టిక్ ట్రే లో శుభ్రమైన ఇసుక వేయాలి100 విత్తనాలను వరుసగా వేయాలి (ప్రతీ వరుసకు 10 చొప్పున)నీరు జల్లుతూ 7%–%10 రోజుల పాటు చూడాలి

ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో లెక్కకట్టి మొలక శాతం తెలుసుకోవాలి, 80% కంటే తక్కువ మొలక శాతం వస్తే:

విత్తన మోతాదును పెంచాలి లేదా వేరే కంపెనీ విత్తనాలు తీసుకోవాలి.

రైతులు పై సూచనలు పాటిస్తే కొంత వరకు అన్నా నకిలీ విత్తనాల బారిన పడకుండా అధిక దిగుబడులు పొందవచ్చు.

" నకిలీ విత్తనాలను తిరస్కరిస్తేనే లినాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయి

అవగాహననే ఆయుధం.. నాణ్యతే విజయానికి పునాది..

జి. అజయ్ కుమార్

వ్యవసాయ నిపుణులు

## కాంగ్రెస్ ప్రజా పాలన లో పేదింటి కుటుంబాలకు అండ

**ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు**



**సంస్థాన్ నారాయణపుర్,( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు పోలోజు నరసింహ చారి ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యములో దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలను, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ నిర్మిస్తామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని తెలంగాణ జన సమితి పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ సర్దార్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 250 గజాలు ఇంటి స్థలం పెన్షన్ విషయంపై వినతిపత్రం అందించారు.

## రజక నాయి,బ్రాహ్మణుల విద్యుత్ బకాయిలు చెల్లించాలి

17 న జరిగే ఇందిరాపార్కు ధర్నా ను విజయవంతం చేయండి

రాష్ట్ర అధ్యక్షులు ప్రసాదం విష్ణు,ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్



**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి):** రజక నాయి బ్రాహ్మణుల విద్యుత్ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర అధ్యక్షులు ప్రసాదం విష్ణు, కార్యదర్శి చెన్నారం మల్లేష్ అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణుల బకాయిలు విడుదల చేయాలని ఈనెల 17వ తేదీన చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోడపత్రిక కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,12,586 మంది రజక నాయి బ్రాహ్మణుల జీవో నెంబర్ రెండు ప్రకారం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని గత ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. వాటికి సంబంధించిన 200 కోట్ల రూపాయలు ప్రస్తుతం విద్యుత్ విడుదల చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సికిలమెట్ల ప్రభాకర్, మండల కోశాధికారి సికిలమెట్ల శ్రీనివాస్, సంఘ నాయకులు శ్రవణ్,రాములు, సురేష్,మహేష్,హేమెందర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి ):** అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సమతా సంక్షేమ సమితి దళిత మోర్చా నల్గొండ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి నెలలో 2025 లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్ గా నిలిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయడం జరిగింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి టాపర్లుగా నిలిచిన విద్యార్థుల ప్రతిభ పురస్కారాలు వారి తల్లిదండ్రులను సన్మానించి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాతేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పురస్కారాలు మరెన్నో అందుకోవాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వర్షిని రెడ్డి, ముత్యాలు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక



## తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో

# కలెక్టర్ కు వినతి పత్రం

**-తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వినతి**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి )** తెలంగాణ తొలి మలి దశ ఉద్యమకారుల వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దరిశెట్టి కు వినతిపత్రాన్ని అందించారు.సకల జనులు నిస్వార్థంగా త్యాగనిరతితో ఆరు దశాబ్దాల పాటు చేసిన పోరాటాల ఫలితంగా బలిదానాల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మీకు తెలుసు దాదాపు ఆరు దశాబ్దాలపాటు సాగిన తొలి మలి దశ ఉద్యమాలలో అనేక మంది ప్రాణాలు కోల్పోయినారు 1300 మంది బలి దానాలకు పాల్పడ్డారు.ఇంత ఘనమైన చరిత్రను గత 10 ఏండ్ల కాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వము ఉద్దేశ పూర్వకంగానే ఉద్యమకారులను విస్మరించింది. ఫలితంగా ఉద్యమకారులు ఆర్థికంగా మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు.వారంతా తీవ్ర మనోవేదనకు లోనయ్యారు.గత ఎన్నికల సమయములో తెలంగాణ ఉద్యమకారుల గౌరవాన్ని ఇనుమడింపజేస్తామని ఉద్యమ కారుల సంక్షేమానికి తోడ్పడతామని ఇచ్చిన వాగ్దానం హామి తెలంగాణ ఉద్యమకారులకు ఎంతో మానసిక స్థైర్యాన్ని ఆనందాన్ని ఇచ్చింది. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామిని నెరవేర్చి ఉద్యమ కారులు ఆత్మగౌరవంతో బతకడానికి తోడ్పడాలని కోరారు.అలాగే తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ అమర వీరుల కుటుంబాలకు పెన్షన్ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు వాటా కల్పించాలని విన్నవించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు గోపగాని శంకర్ రావు కెవి కృష్ణారావు పసుపులేటి నాసరయ్య అర్వపల్లి విద్యాసాగర్ సర్దార్ హుస్సేన్ గుంటేటి వీరభద్రం పగడాల నరేందర్ రాచమళ్ళ ఉమా యాదవ్ రెడ్డి బోయిన వరలక్ష్మి సయ్యద్ అజీమ్ అర్వపల్లి సుధాకర్ జడల వెంకటేశ్వరరావు ఫక్రుద్దీన్ బట్టు రాజేంద్ర నాయక్ షేక్ నాగుల్ మీరా సయ్యద్ బురన్ ఆసిఫ్ దరిపల్లి వీరబాబు పెళ్లూరి విజయ్ కుమార్ అల్లిక సంతోష్ కుమార్ అశోక్ సింగ్ కామని అనంతలక్ష్మి ధనలక్ష్మి తిప్పర్తి నాగమణి స్వరూప రెడ్డి పద్మ కమల యాగలక్ష్మి ఉల్లంగి పద్మ ఇనుప శ్రీనివాస్ గాలి రాము గౌడ్ సైదులు మునయ్య అంకాల ఉపేందర్ వెంకటేశ్వర్లు బానోత్ ప్రసాద్ కోరకొప్పు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ సహకారం



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా తీరు, కేబినెట్ సమావేశాల నిర్వహణ, ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన వెల్లడించిన వివరాలు తీవ్ర చర్చకు దారి తీశాయి. తన పార్టీ నిబద్ధతను, రాజకీయ ప్రత్యర్థులపై తన వైఖరిని స్పష్టం చేస్తూ.. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్‌లో ఈటల కీలక వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పాలనా విధానం ఎలా ఉండేదో ఈటల రాజేందర్ తన అనుభవాలను పంచుకున్నారు. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి పదిహేను రోజులకొకసారి తప్పనిసరిగా కేబినెట్ సమావేశం జరిగేది. మంత్రులుగా మేము తీసుకున్న చిన్నపాటి నిర్ణయాలను కూడా కేబినెట్ ముందు ఉంచండి, కేబినెట్ అనుమతి తీసుకోండి అని ఆయన మాకు పదేపదే సూచించేవారు' అని ఈటల గుర్తు చేసుకున్నారు. ఇది గత ప్రభుత్వంలో పాలనా వ్యవహారాల్లో పారదర్శకత, సమిష్టి నిర్ణయాలకు ప్రాధాన్యత ఇచ్చేవారనడానికి నిదర్శనంగా ఆయన చూపారు.కాళేశ్వరం ప్రాజెక్టు వంటి భారీ ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే విధానం ఉండేదని ఈటల స్పష్టం చేశారు. 'కాళేశ్వరం మీద కూడా ప్రతీ చిన్న విషయాన్ని కేబినెట్లో కూలంకుషంగా చర్చించాము' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై కొనసాగుతున్న విచారణ, ప్రభుత్వాల మధ్య విమర్శల నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కాళేశ్వరం అంశంపై తాను, కేసీఆర్, హరీష్ రావులు విచారణ కమిషన్ ముందు ఒకే మాట చెప్పామనడం సరికాదని, నాటి నిర్ణయాలు సమిష్టిగా తీసుకున్నవేనని ఈటల వివరించారు. కుంగిన పిల్లర్లను బాగు చేయించకుండా రైతుల నోట్లో మట్టి కొట్టవద్దని, మేడిగడ్డ బ్యారేజీని తక్షణమే పునరుద్ధరించి, రైతులకు భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈటల రాజేందర్ తన రాజకీయ వైఖరిని స్పష్టం చేస్తూ.. కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తానని పునరుద్ఘాటించారు. 'భూలోకంలో నాకు నరకాన్ని చూపిన వ్యక్తి కేసీఆర్' అని బీఆర్ఎస్‌లో తన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ ఎదురైతే నమస్కారం పెట్టే సంస్కారం తనకు ఉందని, అది తన వ్యక్తిగత గుణమని వివరించారు.తెలంగాణలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చే సత్తా ఉందని.. బీఆర్ఎస్‌తో విలీనం తమకెందుకని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో పేదలను రేవంత్ టచ్ చేశారు.. అదే కాంగ్రెస్ పతనానికి పునాది వేసిందని ఆరోపించారు. 40 ఏళ్ల క్రితం పట్టా ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు ఇళ్లను కూల్చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మరో 20 ఏళ్లపాటు కాంగ్రెస్‌కి ఓటేసే పరిస్థితి లేదంటూ ఈటల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, కేంద్రం నుంచి అనేక ప్రాజెక్టులు తెలంగాణకు తీసుకువచ్చామని కిషన్‌రెడ్డి తరచుగా చెబుతుంటారు. టెక్స్‌టైల్ ప్రాజెక్ట్, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్క్, పసుపు బోర్డు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటివి బీజేపీ కృషి వల్లనే వచ్చాయని, కాంగ్రెస్ మంత్రులు తమ వల్లనే వచ్చాయని చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఈటల మండిపడ్డారు. "మా వల్లనే వచ్చాయని చెప్పుకుంటున్నవారిని ఈడ్చి కొట్టాలి" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మెట్రో నెక్స్ట్ ఫేజ్‌కు కేంద్రం సహకారం అందిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన వాదోపవాదాలకు అద్దం పడుతున్నాయి.

# లోకేష్ జీవితాన్ని చంద్రబాబు నాశనం చేశారు



**కర్నూలు :** తెలుగుదేశం పార్టీ ఎంతో తనకు ఎంతో గౌరవమని, తనకు చాలా మంది సన్నిహితులు ఆ పార్టీలో ఉన్నారని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ అన్నారు. అయితే టీడీపీ బాధ్యతల నుంచి చంద్రబాబు తప్పుకుని, యువనేత నారా లోకేష్‌కు బాధ్యతలు అప్పగించాలని ఏపీ సీఎంకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. తన కుమారుడు లోకేష్ జీవితాన్ని చంద్రబాబు నాశనం చేస్తున్నారని, దయచేసి తాను చేసే సూచనను పాటించాలంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారుకర్నూలులో వక్ఫ్ బోర్డు, వక్ఫ్ భూముల గురించి జరిగిన కార్యక్రమంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొని ప్రసంగించారు. కుమారుడు, యువనేత నారా లోకేష్‌కు తెలుగుదేశం పార్టీని అప్పగించాలని ఏపీ సీఎం చంద్రబాబుకు అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. లోకేష్ జీవితాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారు, ఎలాగూ మీరు జూనియర్ ఎన్టీఆర్‌కు టీడీపీ పగ్గాలు అప్పగించే అవకాశం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. జూనియర్ ఎన్టీఆర్ పేరు ఎత్తడంతోనే అక్కడున్న వారు గట్టిగా అరవడంతో అసదుద్దీన్ షాకయ్యారు. జూనియర్ ఎన్టీఆర్‌కు అంత పాపులారిటీ ఉందా, నాకు తెలియదని వ్యాఖ్యానించారు. టీడీపీ పగ్గాలు ఎన్టీఆర్ చేపట్టే ఛాన్స్ ఉందా అన్నారు. 9 ఏళ్లు చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేశారు. విభజిత ఏపీకి సైతం 5 ఏళ్లు సీఎంగా సేవలు అందించారు. నీ కెరీర్‌లో చాలా చూశావు. ఇక నారా లోకేష్‌కు అవకాశం ఇవ్వాలి. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నితీష్ కుమార్, కుమారస్వామి లాంటి వాళ్లకు పిల్లలపై ప్రేమ, వారి భవిష్యత్ కోరుకుంటే యువతకు అవకాశం ఇవ్వాలి. మా భూములు మా ఇష్టం, మాకు నచ్చింది చేసుకుంటాం. దానిపై మీకు హక్కు ఏముంది. మీ పిల్లలనే మీరు నమ్మనప్పుడు వక్ఫ్ బోర్డు లాంటివి ఏం నమ్ముతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ హిందూత్వ అజెండాతో వస్తే, చంద్రబాబు వస్తారా, నితీష్ కుమార్, చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరి వచ్చి మాకు మద్దతుగా నిలుస్తారా అని ప్రశ్నించారు. సెక్యూలరిజం పేరుతో చీప్ పాలిటిక్స్ చేయకూడదని సూచించారు. జగన్ మోహన్ రెడ్డి కనీసం మమ్మల్ని నమ్ముతామని అంటారు. వక్ఫ్ బోర్డులో మార్పులను వైసీపీ ఎంపీలు వ్యతిరేకించినందుకు వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు. వాళ్లు కనీసం మాకోసం మాట్లాడతారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులు ఉంటారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్య మతస్తులు ఉండకూడదు అని చంద్రబాబు, టీటీడీ చెబుతున్నాయి. అలాంటిది వక్ఫ్ బోర్డులో నాన్ ముస్లింలు ఇద్దరు ఎలా ఉంటారు. అయితే టీటీడీ బోర్డులో అన్య మతస్తులను ఎందుకు తొలగిస్తున్నారు. సెక్యూలరిజం ఎక్కడుందని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. హిందూ ఆలయాలు, బోర్డుల్లో అన్య మతస్తులు ఉండరాదని చెప్పే మీరు, వక్ఫ్ బోర్డుల్లో, మా దర్గా టీమ్స్ లో ముస్లిమేతరులు ఎందుకు ఉండాలి. హిందువులకో న్యాయం, ముస్లింలకు ఓ న్యాయమా అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.

## సిట్ ముందు హజరైన మహిపాల్ రెడ్డి

**వికారాబాద్ :** ఫోన్ టాపింగ్ కేసులో వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పిటిసి ఫోరం మాజీ అధ్యక్షుడు పీలారం పట్లోళ్ల మహిపాల్ రెడ్డికి ప్రత్యేక విచారణ బృందం (సీట్) నుంచి పిలుపు వచ్చింది. ఈ కేసులు సంబంధించిన సాక్షాధారాల గురించి తెలుసుకునేందుకు మైపాల్ రెడ్డి రావాలని సిట్ అధికారులు సూచించారు. సోమవారం జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీట్ కార్యాలయంలో అధికారుల ఎదుట ఆయన హాజరుఅయ్యారరు.

## ఆర్ ఏం పి డాక్టర్ నిర్లక్ష్యం తో వైద్యం వికటించి జిమ్ కోచ్ మృతి

**మేడ్చల్ :** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిదిలోని రిసాలబజా ర్ కు చెందిన జ్ఞానేశ్వర్ గత కొన్ని రోజులుగా జిమ్ కోచ్ గా పని చేస్తున్నాడు. రాత్రి బిర్యానీ తిన్నావా తర్వాత ఛాతీలో నొప్పి రావడంతో తన సోదరి సహాయంతో స్థానిక క్లినిక్ తీసుకువెళ్లగా, ఇది గ్యాస్ ప్రాబ్లెమ్ అని ఇంజక్షన్ ఇచ్చి పంపించగా, మృతుడు ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే మృతి చెందడంతో, మృతుని కుటుంబ సభ్యులు క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్ ఏం పి డాక్టర్ బొల్లారం పోలీసులు అదుపులోకి తీసుకుని బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిటి వరం

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన - మండల కాంగ్రెస్ నాయకులు**




**సంస్థాన్ నారాయణపూర్, ( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరెంటత్ శీను నాయక్, గ్రామ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అవసరం పడుతుందని, ఏ ఆపదలో వచ్చిన నేనున్నానని మునుగోడు ముద్దుబిడ్డ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సాకారం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బలవంతంగా నీరా కేఫ్ మూసివేత

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో పోలీసులు మరోసారి అత్యుత్సాహం చూపించారు. తెలంగాణ భవన్ సమీపంలో బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 12లో ఉన్న నిలోఫర్ కేఫ్‌ను ఉన్నపళంగా మూసివేయించారు. కేఫ్ లోపల ఛాయ్ తాగుతున్న కస్టమర్లను కూడా బలవంతంగా బయటకు నెట్టుకొచ్చి అక్కడి నుంచి పంపించేశారు.ఫార్ములా ఈ కార్ రేసు కేసులో విచారణ భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం గేటు వద్దే బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కార్యకర్తలు నిలోఫర్ కేఫ్ దగ్గర గుమిగూడే అవకాశం ఉందని భావించిన పోలీసులు అత్యుత్సాహం చూపించారునిలోఫర్ కేఫ్‌లో ఛాయ్ తాగుతున్న వారిని బలవంతంగా బయటకు పంపించేశారు. అనంతరం కేఫ్‌ను మూసివేశారు. దీన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాను కూడా అక్కడి నుంచి పంపిచేశారు. అలాగే కేఫ్ సమీపంలో కనిపించిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

## కేసుల పేరుతో వేధింపులకు భయపడం

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం**

**జగిత్యాల లో ఎమ్మెల్సీ కవిత**

అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడితే భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జగిత్యాల నవదుర్గ ఆలయం రెండో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా మహిళలతో కలిసి కుంకుమ పూజలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు.
అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు, ప్రజలకి ఎన్నో హామీలిచ్చి అందరినీ మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు భరోసా సహా అన్ని హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. పింఛన్లు పెంచలేదు.. మహిళలకు 2,500 ఇవ్వలేదు.. ఇలా అన్ని హామీలను కాంగ్రెస్ ఎగవేసిందన్నారు. హామీల అమలు పై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామని తెలిపారు. మా పార్టీ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు లకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందని తెలిపారు. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్ విచారణ చేసిందని, ఈరోజు కేటీఆర్ ఏసీబీ విచారిస్తోందని తెలిపారు. మేం వేధింపులకు భయపడే వాళ్ళం కాదు.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారని చెప్పారు. కేటీఆర్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ భవన్ తాళం వేయడం దుర్మార్గమన్నారు. మా కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమని తెలిపారు. మా పార్టీ లోపాలను సవరించుకుంటాం.. మా మీద ఎవరైనా దాడికి వస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని తెలిపారు. యాసంగిలో ఇచ్చినట్టు మూడు ఎకరాల భూమి ఉన్న రైతులకే భరోసా ఇస్తారా...రైతులందరికీ ఇస్తారా అనే దానిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బిఎస్ఎన్ఎల్ చౌకైన రీఛార్జ్ ప్లాన్.. రోజుకు 2జీబీ డేటా, 80 రోజుల వ్యాలిడిటీ..

**హైదరాబాద్ ;** ప్రైవేట్ టెలికాం కంపెనీలతో పోటీ పడటానికి ప్రభుత్వ టెలికాం సంస్థ ఖాఔఒ ఒకదాని తర్వాత ఒకటి చౌకైన, ఎక్కువ ప్రయోజనాలతో కూడిన ప్రీపెయిడ్ ప్లాన్‌లను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలోనే కంపెనీ ఇప్పుడు మరో కొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ లో కాలింగ్, డేటా ప్రయోజనాలు ఉంటాయి. అంతేకాకుండా దాదాపు 80 రోజుల దీర్ఘకాల చెల్లుబాటుతో వస్తుంది. ఇప్పుడు ఈ బిఎస్ఎన్ఎల్ ప్లాన్ గురించి పూర్తిగా చూద్దాం.బిఎస్ఎన్ఎల్ కంపెనీ రూ. 485 ప్లాన్‌ను తీసుకొచ్చింది.ఈ ప్లాన్ లో ప్రతిరోజూ 2ఉః హై-స్పీడ్ డేటాను పొందొచ్చు. అంతేకాకుండా ఈ ప్లాన్ అపరిమిత కాలింగ్ సౌకర్యాన్ని కూడా అందిస్తోంది. అంటే రోజంతా కావలసినంత మాట్లాడవచ్చు. దీనితో పాటు బిఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ 100 ఉచిత ూఓూలను కూడా అందిస్తోంది. అంటే.. డేటా, కాలింగ్‌తో పాటు సాధారణ ూఓూలను కూడా పంపవచ్చు.ఈ బిఎస్ఎన్ఎల్ ప్లాన్ ఎక్కువ డేటాను ఉపయోగించేవారికి, రీఛార్జ్ ప్లాన్ చేసుకోవడానికి బడ్జెట్ దాదాపు రూ. 500 మాత్రమే ఉంటె ఈ ప్లాన్ ఉత్తమ ఎంపిక కావచ్చు. ప్రైవేట్ టెలికాం కంపెనీల ప్లాన్‌లో ఈ ప్రయోజనాలన్నింటినీ కోరుకుంటే కనీసం రూ. 600 ఖర్చు చేయాల్సి ఉంటుంది.

## జూన్ 27 నుండి రాష్ట్ర ప్రీమియర్ ఇండస్ట్రియల్ ఇన్నొవేషన్ - టెక్నాలజీ ఎక్స్‌పో

**హైదరాబాద్ :** టెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఈఛఅఅఎ), 108 సంవత్సరాల ప్రాచీన వాణిజ్య సంస్థ, జూన్ 27 నుండి 29 వరకు హిటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఇన్నొవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో (ఎమిఇచీ 2025) రెండవ ఎడిషన్‌ను నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ ధమ్మకుంట శ్రీధర్ బాబు గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నారు.ఈఛఅఅఎ అధ్యక్షుడు డా. సురేష్ సింగాల్మాట్లాడుతూ, "సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు వేయడమే ఈ ఎక్స్‌పో యొక్క ముఖ్య ఉద్దేశం" అన్నారు

**ఇందులో ప్రధాన ఆకర్షణలు:**

దేశమంతటినుంచి 110 స్టాల్స్, ముఖ్యంగా మొబిలిటీ, రిన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, స్మార్ట్ టెక్నాలజీ, ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్, మెషీన్ టూల్స్, ఆటోమేషన్ టెక్నాలజీస్ ప్రదర్శన.15,000 మందికి పైగా సందర్శకులు రానున్నట్లు అంచనా.ఉచిత ప్రవేశం, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రవేశం కలదు.ఈఛఅఅఎ అధ్యక్షుడు డా. సురేష్ సింగాల్ మాట్లాడుతూ, "ఈ ఏడాది ఎడిషన్ మరింత విస్తృతంగా, ప్రభావవంతంగా జరగనుంది. ఇది భారత పరిశ్రమ భవిష్యత్‌కు వీక్షణం అందించే వేదికగా నిలవనుంది" అన్నారు.ఈ ఎక్స్‌పోను భారత ఓూఓఇ మంత్రిత్వ శాఖ (ఖఓూ స్కీమ్ ద్వారా), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఇన్వెస్ట్

# డైరెక్ట్‌గా ఓటీటీలోకి కీర్తి సురేశ్- సుహాస్ మూవీ




తెలుగులో ఫేమస్ పద్యాల్లో 'ఉప్పు కప్పురంబు.. నొక్క పోలికనుండు' ఒకటి. ఈ పద్యాన్నే టైటిల్‌గా పెట్టుకుని ఓ సినిమా వచ్చేస్తోంది. హీరోయిన్ కీర్తి సురేశ్– హీరో సుహాస్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ ఉప్పు కప్పురంబు. ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోనే రిలీజ్ కానుంది. అమెజాన్ ప్రైమ్ తన ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం రూపొందించిన ఒరిజినల్ మూవీ ఇది.

**ఓటీటీలో..**

ఐవి శశి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎల్లనార్ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధికా లావు నిర్మించారు. సినిమా బండి ఫేమ్ వసంత్ కథ అందించారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జూలై 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. చిట్టి జయపురం గ్రామవాసులు అందించే వినోదాల విందుకు సిద్ధంగా ఉండమని ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.



# ఎ ఏంటి.. రాజా సాబ్‌కి సీక్వెల్ కూడానా.. మారుతి ఇచ్చిన క్లారిటీతో ఫ్యాన్స్ షాక్

రెబల్ స్టార్ ప్రభాస్ అరడజను సినిమాల షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన గత కొద్ది రోజులుగా నటిస్తున్న ది రాజా సాబ్ టీజర్ ఈ రోజు విడుదలైంది. ఈ టీజర్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అని చెప్పాలి. ముగ్గురు హీరోయిన్ల గ్లామర్ కూడా మరింత జోష్ తీసుకొచ్చింది. ప్రభాస్ కామెడీ, రొమాంటిక్ ట్రాక్ అదిరిపోగా, సంజయ్ దత్ వింత గెటప్స్, ఆ రాజ మహల్ చుట్టూ జరిగే కథ, హారర్ ఎలిమెంట్స్ అన్ని కూడా ప్రేక్షకులకి మంచి మజాని అందించాయి. టీజర్‌లో ప్రభాస్ స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఫ్యాన్స్‌కి ఫుల్ ట్రీట్ అందించాయి. వీఎఫ్ఎక్స్, తమన్ బీజీఎం మాత్రం టాప్ నాచ్‌లో ఉంది. ఇక కెమెరా వర్క్ కూడా గ్రాండియర్‌గా ఉంది. టీజర్‌తో రాజా సాబ్ మూవీపై భారీ అంచనాలు పెరిగాయి. డిసెంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్ గా ది రాజా సాబ్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమా ఎవరి ఊహలకు అందదని మారుతి అన్నారు. ఈ మూవీ రన్ టైం, సీక్వెల్‌పై ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సినిమాకు సంబంధించి చాలా కంటెంట్ తీసేసిన మారుతి ఫైనల్‌గా మూడు గంటల పాటు సినిమాని రెడీ చేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు. తీయాల్సిన సీన్లు కొన్ని ఉన్నాయి. పాటలు బాలెన్స్. అవన్నీ కలిపితే మూడున్నర గంటలు గ్యారెంటీ. దాన్ని ఎంత ట్రిమ్ చేసినా మూడు గంటల లెక్క తేలుతుంది అని చెప్పుకొచ్చారు. ఇక ది రాజా సాబ్ మూవీకి సీక్వెల్ ఏమైనా ఉంటుందా?' అనే ప్రశ్నకి మారుతి స్పందించారు. పార్ట్ 2 కోసం బలవంతంగా స్టోరీని సాగదీసి రుద్దనని స్పష్టం చేశారు. 'మూవీ పూర్తయ్యాక చూద్దాం. పార్ట్ 2 కోసం బలవంతంగా కథ సాగదీసి రుద్దను. దానిపై ఫుల్ క్లారిటీ మాకు ఉంది. నటీనటులకు 8 గంటల వర్క్ అనేది సాధారణం. కానీ ఈ మూవీ కోసం మేము 18 గంటలు వర్క్ చేశాం. అందుకే టీజర్ సహా ఇంత మంచి అవుట్ పుట్ వచ్చింది.' అని చెప్పుకొచ్చారు. తమన్ అద్భుత మ్యూజిక్ అందిస్తున్నారు. అది సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. హీరో ఎంట్రీ సాంగ్, ముగ్గురు హీరోయిన్స్‌తో మరో సాంగ్ అన్నీ డార్లింగ్ ఫ్యాన్స్‌తో పాటు ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓ అభిమానిగా నా హీరోను ఎలా చూపించాలనుకున్నానో అలానే చూపించా. ప్రభాస్ ప్రత్యేక కామెడీ టైమింగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో చూపించాలనుకున్నాం. హారర్ కామెడీ జానర్‌కు డిఫరెంట్‌గా ఈ స్టోరీ ఉంటుంది. ప్రభాస్‌కు నాపై ఉన్న నమ్మకంతో ఈ తరహా కథ చేశాను అని మారుతి చెప్పుకొచ్చారు.



# తండ్రి జేబులో నుండి డబ్బులు కొట్టేసిన అక్కినేని హీరో..

## మరి ఈయన కొడుకులు సంగతేంటి?

తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్రమశిక్షణతో వారిద్దరు తమ నటనా జీవితాన్ని సాగించారు. నేటితరం నటులకు వారు ఆదర్శం. తెలుగుభాషా పరిరక్షణకు అక్కినేని నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారు. తెలుగు చిత్రపరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడానికి అక్కినేని ముఖ్య కారకుడు. ఏఎన్ఆర్ కేవలం 16 ఏళ్ల వయసులోనే సినీ రంగంలోకి అడుగుపెట్టి తనదైన శైలిలో ప్రేక్షకులని అలరించారు. తుదిశ్వాస వరకు కూడా సినిమాల్లో నటిస్తూ తన ప్రతిభను చాటారు. తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాగేశ్వరరావు , సినీ పరిశ్రమలో ఎన్నో అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారాలను అందుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తనయుడిగా ఇండస్ట్రీకి వచ్చి తండ్రికి తగ్గ తనయుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నాగార్జున. విదేశాల్లో చదువు పూర్తి చేసుకున్న నాగ్ 'విక్రమ్' సినిమాతో హీరోగా సినీ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 'మన్మథుడు' అనే ట్యాగ్‌తో మహిళా అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వరుస విజయాలతో కింగ్ నాగ్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నాగార్జున, త్వరలోనే కుబేర అనే సినిమతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ గత రాత్రి హైదరాబాద్‌లో జరగగా, ఈ కార్యక్రమంలో నాగార్జున ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఈ ఈవెంట్‌లో యాంకర్ సుమతో నాగార్జున చిట్‌చాట్ లో భాగంగా ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "అక్కినేని నాగేశ్వరరావు గారి వాలెట్ నుంచి డబ్బులు దొంగతనం చేశారా?" అనే ప్రశ్నకు "అవును, చేశాను!" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. డబ్బు సంపాదించాలంటే ఉండకూడని లక్షణాలు ఏంటని అడిగితే, "ఆశ, బద్ధకం" అని తెలియజేశారు. ప్రస్తుత తరం యువతకు ఇచ్చే సలహా ఏమిటన్న ప్రశ్నకు "ఫోన్ చూడటం తగ్గించండి" అని సమాధానం ఇచ్చారు. అయితే నాగ్ కామెంట్స్ పై నెటిజన్లు "మీరూ అందరి మాదిరిగానే తండ్రి పాకెట్‌లోంచి డబ్బులు తీసారా?" అంటూ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. అయితే తన కొడుకులు చైతూ, అఖిల్‌లు మాత్రం తన మాదిరిగా డబ్బులు దొంగతనం చేయలేదని స్పష్టం చేశారు. అందుకు కారణం తాను పర్స్ వాడకపోయేవాడినని చెప్పుకొచ్చారు.

# ఓర చూపులతో పిచ్చెక్కిస్తున్న శ్రీలీల



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.